క్లుప్తంగా

ఊరటనిచ్చిన వర్షం

సదుం: మండల కేంద్రంలో పాటు పలు చోట్ల ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. కొన్ని రోజులుగా వర్షాభావ పరిస్థితులతో పలు ప్రాంతాలలో వేరుశనగ పంట ఎండుతోంది. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం రైతన్నలకు ఊరటనిచ్చింది. కొంతవరకైనా ఇలాగే మరికొన్ని పర్యాయాలు కురిస్తే కొంతవరకైనా పంట దక్కుతుందనే ఆశాభావంతో రైతులు ఉన్నారు.

ప్రింటర్లు వితరణ



ప్రింటర్లు అందజేస్తున్న నిర్మల

రొంపిచర్ల: స్థానిక జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లకు రూ. 50 వేల విలువ చేసే రెండు ప్రింటర్లను నిర్మల సోమవారం వితరణ చేశారు. పూర్వ విద్యార్థి అయిన ఆమె ప్రింటర్లను అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో రోసా అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్, లోకనాథరెడ్డి, సతీష్, మునిరాజ, కిశోర్ పాల్గొన్నారు.

మంత్రి వస్తున్నారంటూ ఇంటింటికీ వెళ్లి..!

పుంగనూరు: తెలుగుదేశం పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మంగళం, స్థానిక బీఎంఎస్‌క్లబ్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. మహిళలకు రుణాలు పంపిణీ చేశారు. ఇదలా ఉంచితే, మంత్రి వస్తున్నారంటూ ఇంటింటికీ వెళ్లి సమావేశానికి మహిళలను తీసుకువచ్చినా మంత్రి మాత్రం హాజరుకాకపోవడం గమనార్హం!

పుంగనూరు ఏడీగా శ్రీనివాసులు

పుంగనూరు: పుంగనూరు సబ్ డివిజన్ ట్రాన్స్‌కో ఏడీగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలికిరి నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ రవి చిత్తూరుకు బదిలీ అయ్యారు. అలాగే పట్టణ ఏఈ శశికుమార్‌ను చౌడేపల్లెకు, సోమల ఏఈ మహేంద్రరెడ్డిని పుంగనూరు పట్టణ ఏఈగా బదిలీ చేశారు. ఏడీ శ్రీనివాసులును ఏఈలు, సిబ్బంది, అలాగే ఈఈ శ్రీనివాసమూర్తిని నూతన ఏడీ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు.

రిజర్వాయర్లకు అధిక ప్రాధాన్యత

బైరెడ్డిపల్లి: రిజర్వాయర్లను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం పలమనేరు ఎమ్మెల్యే ఎస్.అమరనాథరెడ్డి, ఎంఎల్‌సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి ఆయన కైగల్ జలపాత ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో కైగల్ రిజర్వాయర్‌కు గతంలో నిధులు మంజూరు చేశారని, రిజర్వాయర్ పనులను కూడా పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు దాహార్తి తీర్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ మనోజ్‌రెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి ఉత్సవాలు



విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామి

రామకుప్పం: స్థానిక శ్రీవళ్లీదేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం సు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణ చేశారు. మయూర వాహనంపై వళ్లీ దేవసేన సమేతుడై సుబ్రమణ్యస్వామి ఊరేగారు. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించారు. సాయంత్రం భక్తులు వివిధ ఆకారాల్లో వీపులకు శూలాలు గుచ్చుకుని కావడులను స్వామికి సమర్పించారు. హరోం హర నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలను పంపిణీ చేసారు.

ఇసుక అక్రమ రవాణాను
అడ్డుకున్న గ్రామస్తులు

- కౌండిన్యలో ఇసుకాసురులపై ధ్వజమెత్తిన మైనారిటీలు
- వక్ఫ్ భూముల్లోనూ ఇసుక తోడేస్తున్నారని మండిపాటు
- గ్రామస్తులపై అక్రమార్కుల దౌర్జన్యం
- ఆగ్రహించిన గ్రామస్తులు.. జేసీబీతో ట్రాక్టర్లు రాకుండా దారి మూత



ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న నాగమంగళం గ్రామస్తులు



కౌండిన్య నదిలో యథేచ్ఛగా చేస్తున్న ఇసుక తవ్వకాలు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పలమనేరు ప్రాంతంలో ఇసుక స్మగర్లు రెచ్చిపోతున్నారు.నిత్యం కౌండిన్య నదిలో ఇసుకను జేసీబీలు, హిటాచీలతో వందలాది లోడ్లను ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. దీనికి అధికారులు అడ్డుకట్ట వేయకపోవడంతో ఆగ్రహించిన నాగమంగళం గ్రామస్తులే ఇసుక అక్రమరవాణాను అడ్డుకున్నారు. దీంతో ఇసుకాసురులు రెచ్చిపోయి వారిపై దౌర్జన్యానికి దిగారు. దీంతో గ్రామస్తులంతా ఏకమై ఇసుకను ట్రాక్టర్లతో తరలించే దారిని జేసీబీ పెట్టి మరీ తవ్వించి ఆ మార్గాన్ని మూసేశారు. అయినా తాము తగ్గేదేలే అని ఇసుకాసురులు సవాల్ విసిరారు. ఈ సంఘటన పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫాం కౌండిన్య నది వద్ద సోమవారం చోటుచేసుకుంది.

మూడు నెలలుగా గ్రామస్తుల పోరాటం

తమ గ్రామ సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలపై నాగమంగళం గ్రామస్తులు ఇసుకాసురులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా, స్థానిక అధికారుల నుంచి జిల్లా కలెక్టర్‌కు దృష్టికి సమస్యను నివేదించినా ఎవరూ స్పందించలేదు. దీంతో మరింత రెచ్చిపోయిన అక్రమార్కులు నది పక్కనే ఉన్న వక్ఫ్ భూములపై సైతం కన్నేశారు. ఆ భూముల పైనున్న మట్టిని జేసీబీలతో తవ్వి కిందనున్న ఇసుకను తోడడం మొదలు పెట్టారు. దీంతో గ్రామస్తులు వారిని అడ్డుకోవడంతో ఇసుకాసురులు మరింత రెచ్చిపోయారు.





ఏం చేస్తారో చేసుకోండని చెబుతున్న ట్రాక్టర్ డ్రైవర్, జేసీబీతో దారిని తవ్వేసిన గ్రామస్తులు

ఇసుక ట్రాక్టర్లు వెళ్లే దారిని తవ్వించిన గ్రామస్తులు

పరిస్థితి రోజు రోజుకూ శ్రుతి మించుతుండడంతో గ్రామస్తులు సోమవారం ఓ జేసీబీని తెప్పించి ఇసుకను తరలించే దారిలో వాహనాలు వెళ్లకుండా తవ్వించేశారు. అప్పటికీ తగ్గని స్మగర్లు మరో మార్గం మీదుగా ఇసుకను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పక్కనే ఉన్న ఎస్వీ వెటర్నటీ సైంటిస్టులు సైతం రాతపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇసుకను తోడుతున్న ప్రాంతం చెన్నై- బెంగళూరు హైవేకు ఆనుకుని రోడ్డుపై వెళ్లేవారికి బాగా కనిపిస్తోంది. కానీ ఈ మార్గంలో వెళ్లే ఎస్పీ, కలెక్టర్, ఆర్డీఓ, మైనింగ్ ఏడీ, ఇరిగేషన్ తదితర అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

రోజూ 500 ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా

కౌండిన్య నుంచి ఇసుకాసురులు రోజూ 500 లోడ్ల ఇసుకను రహస్య డంపింగ్‌లకు, పట్టణంలోని ఇతరత్రా పనులకు తరలిస్తున్నారు. మెయిన్ రోడ్డులో ఉదయం నుంచి రాత్రి వరకు ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా ఏ అధికారీ చర్యలు తీసుకున్న పాపానపోవడం లేదు. రోడ్డుపై అక్కడక్కడా ఉన్న సీసీ కెమెరాలను అధికారులు పరిశీలించినా గంటకు ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా అవుతోందో ఇట్టే తెలుసుకోవచ్చు. ఈ ఇసుక దందాకు అడ్డుకట్ట వేసే మగాడెవడ్రా బుజ్జీ..అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నేటి నుంచి గ్రామసభలు

సదుం: మండలంలో మంగళవారం నుంచి మా మంచి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజశేఖర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 18 పంచాయతీల పరిధిలో మూడు రోజుల పాటు నిర్వహిస్తామని, తొలిరోజు చింతలవారిపల్లెలో మధ్యాహ్నం 12 గంటలకు సభ నిర్వహిస్తామని, ఆ తర్వాత 26న గొంగివారిపల్లెలో నిర్వహించే సభతో గ్రామసభలు ముగుస్తాయన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: స్థానిక ఐటీఐ కాలేజీలో ఖాళీ సీట్ల భర్తీకి నాలుగవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. ఈ నెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని 27లోపు వచ్చి సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలన్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసిన అభ్యర్థులు 28న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని చెప్పారు.

ఎంపీడీఓకు నివాళి



నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బైరెడ్డిపల్లి: గుండెపోటుకు గురై మరణించిన స్థానికుడు, రామసముద్రం ఎంపీడీఓ బి.రమణ భౌతిక కాయానికి రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, మండల కన్వీనర్ కార్తిక్, మండల వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంట్ మహేష్, సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

డెంగీపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్



ఏఎన్ఎంలతో మాట్లాడుతున్న అధికారులు

వి.కోట: పగటిపూట కుట్టే దోమల కారణంగా డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ కోరారు. సోమవారం పట్టణంలోని సచివాలయం-1 వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యాధికారులు డెంగీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఇళ్ల వద్ద నీటి తొట్టెలను రెండ్రోజులకోసారి శుభ్రం చేసుకోవాలన్నారు. ఎవరైనా జ్వరం బారిన పడితే ఆలస్యం చేయకుండా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో డెంగీతో మరణించిన చిన్నారి ఫాతిమా నివాసం ఉన్న మసీధి వీధిలో పర్యటించారు. నీళ్ల ట్యాంకులను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించడంతోపాటు దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అలాగే పట్టణంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎస్ లక్ష్మి, ఈఓ శివశంకర్, డాక్టర్ మాధవి, శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని పలమనేరు ఎమ్మెల్యే ఎస్.అమరనాథ రెడ్డి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో కార్మికులకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేసిన రోజుల్లో వారు ప్రాణాలనూ లెక్క చేయక సేవలు అందించారని కితాబిచ్చారు. అందుకే కార్మికుల ఆరోగ్యానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చన్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఎస్‌టీఎస్‌యూ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఐఎంఏ నాయకులు యుగంధర్, ఆర్‌ఎంఓ శారద, కమిషనర్ రమణారెడ్డి, వైద్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

పెద్దపంజాణి: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఎస్.అమరనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శంకర్రాయలపేట పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు.. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ హరినాథ్, నాయకులు ఆనంద్, చలపతి, భానుప్రకాష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

వి.కోట: పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడానికి వారంలో రెండు రోజుల పాటు ×పొలం పిలుస్తోంది₹ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి తెలిపారు. 24న మంగళవారం గోనుమాకులపల్లె, తోటకనుమ, 25న బుధవారం బోడిగుట్లపల్లె, కుంభార్లపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు(పులిచెర్ల): విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని కోర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు రాజమ్మ అన్నారు. సోమవారం కల్లూరు హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ సంక్రమించే విధానం, దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వరపత్తి వెంకటసిద్ధులు, చంద్రబాబు, రేణుకాదేవి, పద్మవేణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ ఉద్యోగులు

పుంగనూరు: మున్సిపాలిటీలో మేనేజర్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు సోమ వారం బదిలీపై ఇక్కడికి వచ్చి విధుల్లో చేరారు. నూతన మేనేజర్‌గా విజయభారతి, ఉద్యోగులు నాగరాజ, రెడ్డిమస్తాన్, మునివెంకటప్ప, సహదేవ, పాండురంగయ్య తదితరులు బాధ్యతలు స్వీకరించారు. వీరందరూ మర్యాదపూర్వకంగా కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని కలిశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



శాంతి సందేశమిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

వి.కోట: మండలంలోని కృష్ణాపురం సమీపంలోని సయ్యద్ ఆలీ పీరాన్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్తకు చెందిన ఆనాటి చిహ్నాలు ప్రదర్శనగా ఉంచారు. ట్రస్టీ సయ్యద్ ఆలీ పీరాన్ షా మాట్లాడుతూ, శాంతి సందేశంతో అల్లా నమ్మిన ఇస్లాం చివరి ప్రవక్త మహ్మద్ ప్రవక్త అని ఆయన మార్గం శాంతి మార్గమన్నారు. కార్యక్రమానికి కర్ణాటక, తమిళనాడు నుంచే కాకుండా జిల్లా నలుమూలలు పెద్ద సంఖ్యలో హిందూ ముస్లింలు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు కృషి చేసిన సీఐ సోమశేఖర్ రెడ్డి, పోలీసులను ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

మత్తు పదార్థ రహిత దేశం కావాలి



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య విద్యార్థులు

గుడుపల్లె: భారత దేశాన్ని మత్తు పదార్థ రహిత దేశంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని పీఈఎస్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు అన్నారు. మత్తు పదార్థ రహిత భారత దేశంపై బ్యానర్లు, వాల్‌పోస్టర్లతో సోమవారం పీఈఎస్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు యువత బానిసైతే ఆరోగ్యపరంగా, కుటుంబ పరంగా అన్నీ నష్టపోతారన్నారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన యువత మత్తు బారిన పడి జీవితాల్ని నాశనం చేసుకోరాదని హితవు పలికారు. మత్తు పదార్థాల వ్యసన సమస్యలకు పరిష్కారం చూపడంలో ఆరోగ్య సంరక్షణ వృత్తిపరులు పాత్ర ఎంతో ఉందని, మత్తు పదార్థాలకు ఎవరూ వ్యసనపరులు కారాదని కోరారు.

సాంస్కృతిక సౌరభం

















ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరికథకాలక్షేపం, కూచిపూడి, భరతనాట్యం, గీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. అద్భుత ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు భక్తులు చప్పట్లతో అభినందించారు. అనంతరం అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. -కాణిపాకం